# 9. కథకుడు

తన విషయంలో గర్వపడాల్సింది యేమైనా వుంటే– అది శ్రీపతి కథకుడుగా సంపాయించుకొన్న పేరు మాత్రమే. గత ఆరు సంవత్సరాల కృషీ ప్రజల పొగడ్తలరూపంలో దేశమంతటా వెదజల్లబడ్డది. తన కథ ప్రచురితమైననాడు తనను కొద్దో గొప్పో ఎరిగిన వాళ్ళందరూ ఎదురై "మీ కథ చాలా బావుంది–" అని చిరునవ్వుతో కూడిన అభిప్రాయాన్ని జారీచేస్తారు. ఒకళ్ళిద్దరు మరికొంత అదనపు ఓపికతో తన కళాభిరుచిని అదేపనిగా స్తుతిస్తూ రెండు మూడు రోజులు వెంటపడ్డారు. కాని, కనీసం కాఫీడబ్బులయినా గిట్టుబాటు కాకపోవటంవల్ల త్వరగానే మేల్కొని నిష్క్రమించారు.

సంపాదకులు సయితం తన కథలు బాగున్నాయంటారు. మరికొన్నింటికి ఎదురు చూస్తున్నామంటారు. ఎంత వాడినా ఖర్చువని పదజాలంతో తనను మెచ్చుకుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాలలోని పాఠకులు పోస్టుద్వారా తనను మెచ్చుకోవటమే - తన పేరుకు ప్రబల నిదర్శనం.

బీదరికసమస్య వొక్కటే తన కళాభివృద్ధికి పెట్టని ఆనకట్ట! ఉన్నతభావాల్తో రచనను సాగిస్తూన్న సమయంలో గృహిణి ఇంట్లోకి కావాల్సిన సరుకుల జాబితాను - వంటింట్లోంచి ఏకరువు పెడుతుంది. ఇంక కలం ముందుకు సాగదు. మనస్సు పాడౌతుంది. గాయపడ్డ హృదయంతో పిచ్చివాడులాగు ఊరంతా తిరిగి ఏ అర్ధరాత్రి సమయానికో కొంపజేరుతాడు. సగం రాసి వదిలేసిన ఆ కథ విషయం తిరిగి ఆలోచించేశక్తి మాయమౌతుంది. మరో సమయంలో కొడుకు శిథిలావస్థలోవున్న తన బట్టలమూటతో తయారై, వాటిని సాక్షులుగా చూపుతూ, ఫిర్యాదు చేస్తాడు. నిర్మల

తటాకంలో రాయి పడ్డట్టు- జాగ్రత్తగా పదిలపరుచుకొన్న ఉన్నతాశయాలన్నీ పటాపంచలౌతై. ఇంట్లో కూర్చొని రచనను సాగించేశక్తి తనలోలేదు. ఏ అర్ధరాత్రన్నా ఇల్లంతా మాటుమణిగాక, రచనను సాగిద్దామనుకొని, లాంతరు వెలిగించబోతాడు. అందులో నూనె వుండదు. నిస్పృహతో కలం ముడుస్తాడు. పోస్టేజీకి డబ్బులేక- తన రచనలు అచ్చుకు పోకుండా పదేసి రోజులు కూడా ఆపవలసి వచ్చేది. తలవెంట్రుకలన్ని కష్టాలనడుమ నలుగుతూ రచనను సృష్టించాలి... తన రచనల్ని చదివి ఆనందించే వాళ్లు దేశంలో చాలామంది ఉన్నా- వారెవరికీ తన కృషితో మాత్రం సంబంధంలేదు. తనను కథల్లో చూసిన పాఠకులకు- తన వాస్తవిక జీవితంలో ఏ భాగమైనా తెల్సునా అనేది అనుమానించవలసిన విషయం. తన ఆశయాల్ని మెచ్చుకొనేవారికి, తన జీవిత సమస్యలతో పనేమిటి?

ఆ రాత్రి లాంతర్లో నూనె వుండటమే తనకు ప్రోత్సాహమై- ఏకాగ్ర దృష్టితో నిద్రాముద్రిత ప్రపంచంలోంచి, తెంచుకుపోయి నూతన వాతావరణంలో కథ రాస్తున్నాడు. మధ్యలో గృహిణి "ఏమిటండీ అది?" అన్న మాటలకు అతను ఉలిక్కిపడ్డాడు. ఏదో నేరం చేసినవాడిలాగు కొన్ని నిమిషాలవరకూ నోట మాట రాలేదు.

"క-థ"

"కథ!" అని వెటకారంగా నవ్వి ఆమె అంది: "కూటికీగుడ్డకూ కొరగాని యీ కథలెందుకు? గుడ్డికన్ను మూసినా తెరిచినా వొకటే- మీ రచనలు కూడా కుటుంబానికి అంతే ఉపయోగకరంగా వున్నై. కడుపులో చల్ల కదలనివాళ్ళకి కాని- యీ సాహిత్యం మీ కెందుకూ?"

ఆమె కాపరానికి వచ్చింది మొదలూ, రోజుకొకసారైనా ఈ మాటల్ని అంటూనే వుంటుంది. మొదట్లో ఆమెకు తన ఆశయాన్ని విప్పిచెప్పేందుకు ప్రయత్నించేవాడు; కాని తన మాటలు ఆమె చెవినికూడా సోకకుండానే గాలిలో కలిసి పోతూండటంవల్ల - శ్రీపతి కిక్కురు మనకుండా విని ఊరుకోవటాన్ని అలవాటు చేసుకొన్నాడు.

ఆమె విసుగుతో గొణుక్కుంటూ పడుకుంది.

రచనకు బ్రేకు పడ్డది. కలం ముడిచి - ఆలోచించసాగాడు. తనకు తగిన ప్రోత్సాహమూ, సానుభూతీ, ఆదరణా వుంటే- తన రచనలు ఇంకెంత తీర్చి దిద్దబడేవి! ఈ ఒక్క కుటుంబ సమస్యా తీరిననాడు- తనవి సాటిలేని మేటి రచనలు అవగలవు. కాని తన జీవితంలో అది... తీరని కోరిక!

బీరువాలో పూర్తికాని తన రచనల దస్తరాన్ని చూసి, తన ఓపికకు తనే ఆశ్చర్యపడుతూ, "నా జీవిత సమస్య తీరిననాడు ఇవన్నీ పాఠకలోకానికి కాన్కలు కాగలవు; అందాకా వాటిముఖం నాకూ, నా ముఖంవాటికీ మాత్రమే కన్పిస్తూ వుంటుంది-" అనుకొని నిట్టూర్చాడు.

## 2

అదృష్ట జాతకుల మాటకొస్తే శ్రీపతికికూడా స్థానం ఇచ్చి తీరాలి. ఇతర వారసులు లేని పాతికవేల రూపాయల ఆస్తికి తను యీనాడు అధికారవటం– సామాన్య విషయం మాత్రం కాదు.

ఆ ఐశ్వర్యకాంతిలో– పూర్వపు అతని బీదరిక ఛాయలోని ఏ భాగమూ గోచరించదు. విధివశాన, తన తీరని కోరిక తీరినకోరికగా పరిణమించి, తన పూర్వకష్టాల్ని సయితం మరిచిపొయ్యేటట్టు చేసింది.

అతని జీవిత లక్ష్యం మాత్రం మొదట్లో మారలేదు. పూర్తికాని తన రచనల్ని అనేకులు చదివి ఆనందించే రోజొకటి ఇంకా ముందుందని అతను నమ్మాడు.

అనేకులు తన రచనలకోసం కాచుకు కూర్చున్నారు. సంపాదకుల ఒత్తిడి జాస్తయింది. పాఠకులు తన రచనల్ని పుస్తకరూపంలో చూడాలని కుతూహల పడుతూన్నట్టు ఉత్తరాలు రాస్తున్నారు. తన పేరు అన్ని వైపులనుంచీ ప్రతి ధ్వనిస్తోంది.

అతను అనుకొన్న గొప్పసమస్య రూపుమాసినా, దానిస్థానే మరికొన్ని సమస్యలు రాకపోలేదు. ఆ ఆస్తికి ఇప్పుడు మరికొందరు దాయాదులు తయారై కోర్టుకెక్కారు. తన ఐశ్వర్యం వాళ్ళ చేత కబళింపబడకుండా భద్రపరుచుకోటం మొదటిది – ముఖ్యమైనదీకూడా!

ఉన్న కాస్త తీరికలోనూ పాతరచనల్ని తీసి దుమ్ముదులిపి పూర్తి చేసేందుకు ఉపక్రమించేవాడు. కలం కుంటినడక నడిచేది. హృదయంలో రేకెత్తే ఉన్నతభావాలు కాగితం మీదికి రావటంలేదు. పదాలు తొట్రుపడతై. పూర్వపు రచనను చదువుతే– తెగినచోట పెద్ద అతుకున్నట్టు స్పష్టంగా కన్పిస్తుంది. ఈ రచనా సమయంలో– కోర్టూ, ధనమూ, అనుభవమూ, సౌఖ్యమూ జ్ఞాపక మొచ్చి తన నిశ్చలత్వాన్ని కూకటివేళ్లతో కదిలిస్తుంది. తన దనుకొన్న లేఖిని తనకే ఏకుమేకై ఎదురుతిరుగుతోంది; తన కళకు వృద్ధాప్యం వచ్చిందేమో! రచన కుదరక, విసుగుతో విరమించేవాడు. 'కథకుడు'గా తనను తనే నమ్మలేని స్థితిలో శ్రీపతి తత్వం తయారైంది.

## 3

ప్రభుత్వ చట్టాలకు శ్రీపతిలాటి అనేకమంది జీవితాల్ని తారుమారుచేసే శక్తివుందని– తన జ్ఞాతులు దావా గెల్చిన నాడు మాత్రమే అతను నేర్చుకున్నాడు. శ్రీపతి రెండు సంవత్సరాలు మాత్రమే యీలోకానికి 'శ్రీపతి' అయ్యాడు. ఏ కట్టుగుడ్డల్తో ఆ పూరిపాకను వదిలాడో– ఆ కట్టుగుడ్డల్తో మాత్రమే తిరిగి ప్రవేశించాడు. చలనంలేని

ఆ మట్టిగోడల మధ్య కూర్చొని రెండుసంవత్సరాల క్రితపు వాతావరణాన్ని వెనక్కు చూసుకొన్నాడు- ఎంతలో ఎంతగా పరిణమించిందీ- తన జీవితం!

ఐశ్వర్యవంతుడుగా ఉన్నప్పుడు తనకున్న పలుకుబడి- తనకొక చిన్న ఉద్యోగాన్ని ప్రసాదించటానికి ఉపయోగపడ్డది. ఆ జీతం సరిగ్గా కుటుంబ రక్షణకు మాత్రమే సరిపోతుంది. తను భాగ్యవంతుడుగా ఉన్నప్పుడు తనలో రేకెత్తిన అంతులేని కోరికలన్నీ నేడు అడుగంటిపోయినై.

అర్ధరాత్రి అనేక భావాల మేల్కొల్పుతో, హృదయంలో దాగేందుకు తావులేక ఉరికిపడుతూన్న ఊహల సమూహపు ఒత్తిడితో- శ్రీపతి రచనకు ఉపక్రమించాడు. సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం గృహిణిమాటలకు భయపడి మూలనక్కిన 'కథ'- అది! కాలగమనం ఆ రచనలో మాత్రం మార్పును తేలేకపోయింది!

ఇల్లంతా నిశ్శబ్దదేవత తాండవిస్తోంది. దీపపు వెలుగులో నిద్రాముద్రితలోకాన్ని విడిచి నూతన వాతావరణంలో- కలం నిరాటంకంగా సాగిపోతోంది. పూర్వపు రచనలతో సరిగ్గా సరిపడే విధంగా రాయటాన్ని ఆ కలం తిరిగి యీనాడు ప్రదర్శిస్తోంది. కథ పూర్తయింది. తనలో ఇమిడివున్న 'కళ'కు చలనం లేదని స్ఫురిస్తోంది- రచన చదువుతూంటే- ఏకబిగిని రాసిన కథని తెలుస్తోంది- నశించిందనుకొన్న శక్తి యీనాడు తిరిగి పునర్జన్మ ఎత్తింది- శిశువుగా కాదు. నడివయస్కగా!

భార్య మేల్కొని అంది: "ఏమిటి?" అతను ఉలిక్కిపడలేదు - చలించ లేదు.

"క-థ"

ఆమె కూడా పరామర్శ చేయలేదు. కుటుంబరక్షణ సాగుతూన్నన్నాళ్ళూ తనకు దిగులు లేదన్నట్టు ఆమె పెదవి విరిచి కిక్కురు మనకుండా పడుకొంది.

శ్రీపతికి పూర్వం సంగతి జ్ఞాపకమొచ్చింది. తన మీద కారాలూ, మిరియాలూ నూరిన తన ధర్మపత్నికి యీనాడు తన కళారాధనతో పనిలేదు. తను భ్రమించే ఆటంకాలేమీ లేవు- ఉన్నా అవి తన మీద తగిన చర్య తీసుకునేటంత బలంగానూ లేవు.

జీవితాన్ని రెండు వసంతాలు వెనక్కు తిరిగి చూసుకొన్నాడు. అతని హృదయాంతరాళంలో యీ వాక్యాలు మారుమ్రోగాయ్: "జీవితంలో ఎప్పుడూ ఏదో వొక లోపమూ, సమస్యా ఉండి తీరుతయ్. ఉన్నా దాంతో కళారాధనకు ముడిపెట్టుకోవటం తగనిపని. ఐశ్వర్యవంతుడనై నేను ఆరాధించలేని యీ సాహిత్య సేవను- బీదరికంలోనే సాధించగలను. ఈ వాతావరణంలోనే నా సాహిత్యసేవ మిన్ను ముట్టగలదు."

మరి రెండు సంవత్సరాల్లో ఇది నిజమే అయింది!

*- జనవరి, 1941*